సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



అన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వీవీఎస్ఎస్ యశ్వంత్ (కడియం మండలం) సోమవారం రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.



గోవిందా హరి గోవిందా..

కోనసీమ తిరుపతి.. వాడపల్లి దివ్యక్షేత్రం.. భక్తుల గోవింద నామోచ్చారణతో మార్మోగింది. ఇక్కడి స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. -8లో▸

సముద్రంలోకి 2.70 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,70,529 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

గోదావరి భవన్‌లో స్పందన

- అర్జీలు సమర్పించిన 209 మంది
- స్వీకరించిన కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ



గోదావరి భవన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శుక్లా. చిత్రంలో జేసీ నుపుర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహణకు 'గోదావరి భవన్' పేరిట సరికొత్త హాలు అందుబాటులోకి వచ్చింది. దీనిని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక పూజలు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపుర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 209 మంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలపై క్రియాత్మకంగా స్పందించి, గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. తద్వారా అర్జీదార్లలో విశ్వసనీయత పెంపొందించాలని అన్నారు. నూతన భవనం ప్రజలకు సౌకర్యవంతంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 30 అర్జీలు



అర్జీదారుల ఫిర్యాదును పరిశీలిస్తున్న ఏఎస్పీ ఖాదర్‌బాషా

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. అర్జీదారులు ఆయన ఫిర్యాదులు అందజేసి, తమ సమస్యలు ఏకరువు పెట్టుకున్నారు. వచ్చిన అర్జీల్లో కుటుంబ తగాదాలు, భూ వివాదాలే అధికంగా ఉన్నాయి. ఎక్కువ అర్జీలపై ఏఎస్పీ తక్షణమే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీ కుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్/కొత్తపేట: పోటీతత్వాన్ని ప్రోత్సహించే దిశగా వివిధ ట్రస్టులు ముందుకు వస్తే విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కొత్తపేట మండలం పలివెల జెడ్పీ హైస్కూలులో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన అభయాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ వీవీఎస్ఎన్ మారుతీ బంగారం.. ప్రోత్సాహక బహుమతులు సమకూర్చారు. వీటిని కలెక్టర్ శుక్లా చేతుల మీదుగా అమలాపురంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సోమవారం అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా జి.వెంకట మోహన్‌కు రూ.3 వేలు, సీహెచ్ సాయిదీప్తికి రూ.2 వేలు, ఎం.సునీతకు రూ.1,500 చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందించారు.

నేటి నుంచి సత్యదేవుని శిఖర దర్శనం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దర్శించిన భక్తులు.. స్వామివారి ఆలయ శిఖరాన్ని కూడా దర్శించేలా ఏర్పాట్లు చేసినట్టు అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం తెలిపారు. ఇప్పటి వరకూ భక్తులు సత్యదేవుని దర్శించి వెళ్లిపోయేవారు తప్ప ఆలయ శిఖర దర్శనం చేసే అవకాశం లేదు. ప్రధాన ఆలయంలో సత్యదేవుని దర్శనం, దిగువన యంత్రాలయ దర్శనం అనంతరం నేరుగా దర్బారు మండపం వద్దకు వచ్చేసేవారు. యంత్రాలయం పక్కకు వెళ్లడానికి కూడా వీలు లేకుండా అక్కడ బారికేడ్లు ఉండేవి. ప్రస్తుతం ఆ బారికేడ్లను స్వామివారి ఆలయానికి ఉత్తరాన ఉన్న మెట్ల వద్దకు మార్చారు. దీంతో యంత్రాలయం దర్శనం పూర్తి చేసుకున్న భక్తులు మెట్ల వద్దకు వచ్చి, సత్యదేవుని ఆలయ శిఖరం వైపు చూస్తే అక్కడ కలశాలు దర్శనమిస్తాయని ఈఓ తెలిపారు. ఆలయ శిఖరాన్ని భక్తులు మంగళవారం నుంచి దర్శించేలా ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేయాలని ఈఓ ఆజాద్ ఆదేశించారు.

పట్టణీకరణ.. ప్రణాళికాబద్ధంగా..

- పట్టాలెక్కుతున్న 'అముడా'
- చైర్మన్‌గా డేవిడ్‌రాజ్ నేడు ప్రమాణ స్వీకారం
- ఇకపై జోరందుకోనున్న అభివృద్ధి

సాక్షి, అమలాపురం/కొత్తపేట: పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా దశాబ్దాల కాలంగా హామీలకే పరిమితమైన కోనసీమ ప్రత్యేక జిల్లా ఏర్పాటును సాకారం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ ప్రాంత అభివృద్ధికి మరో గొప్ప ముందడుగు వేసింది. జిల్లా గణనీయమైన అభివృద్ధి సాధించేదుకు అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ – అముడా) ఏర్పాటు చేసింది. దీనికి తొలి చైర్మన్‌గా కొత్తపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు మంగళవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో అముడా దైనందిన కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఇకపై జిల్లాలో పట్టణాభివృద్ధి మరింత ప్రణాళికాబద్ధంగా జరగనుంది. ప్రజలకు మరింతగా సౌకర్యాలు సమకూరనున్నాయి. కీలక ప్రాంతాల సుందరీకరణ జరగడానికి మార్గం సుగమం కానుంది. అముడా ద్వారా పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కూడా మరింతగా బాటలు పడే అవకాశాలున్నాయి.

జిల్లాల పునర్విభజనతో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గతంలో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (గుడా) ఉండేది. దీని పరిధిలోనే ప్రస్తుత కోనసీమ జిల్లాలోని పలు మండలాలుండేవి. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి జిల్లాను కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలుగా రాష్ట్ర ప్రభుత్వం విభజించిన విషయం తెలిసిందే. కాకినాడకు 'కౌడా', రాజమహేంద్రవరానికి 'రుడా' పేర్లతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ప్రభుత్వం గతంలోనే ఏర్పాటు చేసింది. వీటికి పాలక మండళ్లను నియమించడం, అవి ఒక దఫా పదవీ కాలం పూర్తి చేయడం కూడా జరిగాయి. ఈ క్రమంలోనే జిల్లాకు అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అముడా)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి చైర్మన్‌గా డేవిడ్ రాజును రెండు నెలల క్రితమే ప్రకటించింది.



అమలాపురం పట్టణం ఏరియల్ వ్యూ

మరింతగా విస్తరణ

అముడా పరిధిని ప్రభుత్వం తొలుత 359.1 చదరపు కిలోమీటర్లుగా నిర్ణయించింది. దీని పరిధిని ఆరు మండలాలు, 56 గ్రామ పంచాయతీలుగా నిర్ధారించింది. అయితే జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల అముడా పరిధిని ప్రభుత్వం మరింత విస్తరించింది. ప్రస్తుతం 1,256.07 చదరపు కిలోమీటర్లకు దీనిని విస్తరించారు. దీని పరిధిలో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు 14 మండలాల పరిధిలోని 120 గ్రామాలు ఉన్నాయి. సుమారు 7.50 లక్షల జనాభా అముడా పరిధిలో ఉంది.

ఎన్నో ప్రయోజనాలు

- అముడా ఏర్పాటుతో ఈ ప్రాంతానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి.

అముడా స్వరూపమిదీ..

ప్రధాన కేంద్రం: అమలాపురం

విస్తీర్ణం: 1,256.07 చదరపు కిలోమీటర్లు

మున్సిపాలిటీ: అమలాపురం

నగర పంచాయతీ: ముమ్మిడివరం

మండలాలు: 14

గ్రామాలు: 120

జనాభా: 7,50,000

- ఆయా స్థానిక సంస్థలు, గ్రామాల పరిధిలోని లే అవుట్లు, పెద్ద పెద్ద భవనాలకు అముడా అనుమతి తప్పనిసరి. గ్రామ పంచాయతీల్లో 300 గజాలకు పైబడి స్థలంలో ఇళ్లు నిర్మించాలన్నా.. పది మీటర్లు దాటి, మూడంతస్తుల భవనాలు నిర్మించాలన్నా.. అలాగే లే అవుట్లు వేయాలన్నా అముడా అనుమతి తీసుకుని తీరాలి.
- ఫీజు రూపంలో వచ్చే సొమ్ములతో అముడా పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లు, పార్కులు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం వంటి అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడతారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు నిర్మించే ఇళ్లు, కాలనీలకు నిధులు పుష్కలంగా విడుదల కానున్నాయి.
- వీటితో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోని కౌడా, రుడా పరిధిలో సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శనం.
- ఇదే స్థాయిలో జిల్లా కేంద్రమైన అమలాపురంతో పాటు అముడా పరిధిలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశముంది.
- చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారం జరగనుండటంతో అమలాపురంలో అముడా ప్రధాన కార్యాలయం ఏర్పాటుతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించింది.



ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో కలసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అముడా చైర్మన్ డేవిడ్‌రాజు (ఫైల్)

విధేయతకు పెద్ద పీట

అముడా తొలి చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి డేవిడ్‌రాజు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ అంకితభావంతో పని చేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సిఫారసు మేరకు డేవిడ్‌రాజును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అముడా చైర్మన్‌గా నియమించారు. తద్వారా విధేయతకు పెద్ద పీట వేసినట్టయ్యింది. డేవిడ్‌రాజు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో మంగళవారం జరిగే ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి కొత్తపేట నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీగా హాజరు కానున్నారు.

క్రమం తప్పకుండా జగనన్న విద్యా దీవెన



విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

- జిల్లాలో 31,944 మందికి రూ.24,03,71,562 జమ
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న పేదల ఉన్నత విద్యకు ఆలంబనగా జగనన్న విద్యా దీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని కింద క్రమం తప్పకుండా నాలుగు త్రైమాసికాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నుంచి జగనన్న విద్యాదీవెన నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు సోమవారం నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ తదితరులు వీక్షించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. జగనన్న విద్యా దీవెన కింద ఐటీఐ, పాలిటెక్నిక్ డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను మూడు నెలలకోసారి ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోందని వివరించారు. ప్రస్తుతం ఏప్రిల్ – జూన్ వరకూ నిధులను నేడు ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. జిల్లాలో 8,673 మంది ఎస్సీ, 168 మంది ఎస్టీ, 12,758 మంది బీసీ, 2,281 మంది ఈబీసీ, 7,649 మంది కాపు, 275 మంది ముస్లిం, 140 మంది క్రిస్టియన్ కలిపి మొత్తం 31,944 మంది విద్యార్థులకు రూ.24,03,71,562 జమ చేశామని కలెక్టర్ శుక్లా వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మట్టా శైలజ, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, బీసీ సంక్షేమ అధికారి తిక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లు 70 శాతం పూర్తి చేయాలి

- ఇంజినీరింగ్ సహాయకులకు జేసీ ఆదేశం
- గృహనిర్మాణాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నుపుర్ అజయ్

అమలాపురం రూరల్: జగనన్న కాలనీల్లో తమకు కేటాయించిన గృహ నిర్మాణాల్లో 70 శాతం పూర్తి చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపుర్ అజయ్ ఆదేశించారు. గృహ నిర్మాణ పురోగతిపై రాష్ట్ర చీఫ్ ఇంజినీర్, ప్రత్యేక అధికారి జీవీ ప్రసాద్, జేసీ కలసి గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు, గ్రామ/వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. జేసీ నుపుర్ అజయ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు నిర్మిస్తోందని, ఆ దిశగా ఈ నెలాఖరుకు జిల్లాలో 8,632 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి వారం పురోగతి సాధించాలని ఆదేశించారు. లబ్ధిదారులను అన్ని విధాలా చైతన్యపరచాలని, లబ్ధిదారుల ఆర్థిక స్తోమతను విశ్లేషిస్తూ, తక్కువ ఖర్చుతో ఆప్షన్–3 విధానంలో ఇళ్లు నిర్మించి నిర్మించి ఇవ్వాలని స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకే రూ.35 వేల రుణం ఇస్తారని, అలాగే, గృహ నిర్మాణ సంస్థ అడ్వాన్సుగా రూ.20 వేలు ఇస్తుందని చెప్పారు. జిల్లాలో సిమెంటు, ఐరన్, ఇసుక తదితర మెటీరియల్ పుష్కలంగా ఉందని, స్టేజ్ కన్వర్షన్ ద్వారా ఆశించిన పురోగతి సాధించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ సహాయకులపై ఉందని అన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు ఆన్‌లైన్‌లో జనరేట్ చేస్తూ సకాలంలో నిధులు అందించాలని జేసీ నుపుర్ అజయ్ ఆదేశించారు. గృహ నిర్మాణంలో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో పని దినాల కల్పనపై డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో చురుకుగా నాడు–నేడు

- రూ.5.62 కోట్లతో పనులు
- డిసెంబర్ నాటికి పూర్తి
- జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీరాణి

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.5.62 కోట్లతో నాడు – నేడు పనులు జరుగుతున్నాయి. ఇందులో ఆస్పత్రికి అదనపు భవనం నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. ఇప్పుడున్న మూడంతస్తుల భవనంలో ఆధునీకరణ పనులు కూడా చురుకుగా జరుగుతున్నాయి. ఈ పనులను జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ ఎస్‌పీ పద్మశ్రీరాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజినీర్లు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. పాత భవనం ఆధునీకరణ పనుల్లో భాగంగా టైల్స్ వర్క్, విద్యుత్ సరఫరా, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ తదితర విభాగాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. కొత్తగా నిర్మించిన అదనపు భవనంలో వివిధ వైద్య విభాగాలకు సంబంధించిన అత్యాధునిక యంత్రాలు, పరికరాలు ఉంచేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఈ పనుల్లో జాప్యంపై వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజినీర్లతో కలెక్టర్ హిమాన్షు శుక్లా చర్చించడంతో ఈ పనులు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే అదనపు భవనం నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, పాత భవనం ఆధునీకరణ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని డాక్టర్ పద్మశ్రీరాణి తెలిపారు. నాడు–నేడు పనుల ద్వారా సమకూరిన పూర్తి సౌకర్యాలతో ఈ ఆస్పత్రిలో 2024 ఆరంభం నుంచి మరింత మెరుగైన రీతిలో వైద్య సేవలు అందుతాయని చెప్పారు.



ఆస్పత్రిలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మశ్రీరాణి

సేవలు.. మరింత సమర్థంగా..

- పాలనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- నేడు ప్రారంభం
- జిల్లాలో 4 విడతలుగా 372 మందికి..
- ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులు..
- అమలాపురంలో రెండు కేంద్రాల ఏర్పాటు

మండపేట: గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు.. క్షేత్ర స్థాయిలో సుస్థిరాభివృద్ధి, సమర్థవంతంగా ప్రభుత్వ పథకాల నిర్వహణే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అమలాపురంలో మంగళవారం నుంచి నాలుగు విడతలుగా జరిగే ఈ శిక్షణకు జిల్లాలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 స్థాయి వరకూ 372 మంది కార్యదర్శులు ఈ శిక్షణకు హాజరు కానున్నారు.

పాలనలో పారదర్శకకు పెద్ద పీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచాయతీల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పేదల సంక్షేమం, గ్రామ స్వరాజ్యానికి నవతర్న పథకాల అమలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వ, గడప గడపకూ మన ప్రభుత్వం తదితర ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వీటిపై కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా గ్రామ సుపరిపాలనకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ సంస్థ చర్యలు చేపట్టింది.

జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకూ 372 మంది కార్యదర్శులున్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 50 మంది చొప్పున నాలుగు విడతలుగా ఈ శిక్షణ జరగనుంది. ఒక్కో విడతలో ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఆయా అంశాలపై రీసోర్స్ పర్సన్లతో పాటు ఉపాధి హామీ, ఇతర శాఖలకు చెందిన అధికారులు హాజరై, కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ నేపథ్యంలో సాధారణ పరిపాలనకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. ఒక్కో మండలంలోని మొత్తం పంచాయతీ కార్యదర్శుల్లో మూడో వంతు మందికి ఒక్కో బ్యాచ్‌గా శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా అంశాలపై శిక్షణతో పాటు ప్రతి రోజూ హార్ట్‌ఫుల్‌నెస్ సంకల్ప మెడిటేషన్ చేయించనున్నారు. పంచాయతీ కార్యదర్శుల శిక్షణకు అన్ని ఏర్పాట్లూ చేశామని అధికారులు తెలిపారు.

శిక్షణలోని అంశాలివీ..

మొదటి రోజు: స్థానిక స్వపరిపాలన, గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, జగనన్న స్వచ్ఛ సంకల్పం, అంతర్గత రోడ్లు, శ్మశానాలు, జల్‌జీవన్ మిషన్, వీధి లైట్ల నిర్వహణ.

రెండో రోజు: పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, ఆర్థిక వ్యవహారాలు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్ను మదింపు, వసూలు, పంచాయతీల బడ్జెట్, రికార్డుల నిర్వహణ, ప్రతిభా పురస్కారాలు, జవాబుదారీతనం, క్రమశిక్షణ, ఆడిట్, ఇతర అంశాలు.

మూడో రోజు: లే అవుట్లు, భవన నిర్మాణ నియమాలు, జగనన్న భూ హక్కు – భూరక్ష.

4, 5 రోజులు: నథింగ్ అండ్ డ్రాఫ్టింగ్ లెటర్స్, కాండక్ట్ రూల్స్, సీసీఏ రూల్స్, డీఓఎం అండ్ లీవ్ రూల్స్.

ఆరో రోజు: నవరత్నాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, ముల్యాంకనం.

ప్రజలకు మెరుగైన పాలనే లక్ష్యం



గ్రామీణ ప్రజలకు మెరుగైన పాలనను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. పంచాయతీల నిర్వహణ, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై కార్యదర్శులందరికీ పూర్తి అవగాహన కల్పించేందుకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం. – వి.కృష్ణకుమారి, జిల్లా పంచాయతీ అధికారి

ఓటర్ల జాబితాలపై తనిఖీ



కామనగరువులో తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ వసంతరాయుడు

అమలాపురం టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అమలాపురం ఆర్‌డీఓ ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి హోదాలో ఓటర్ల జాబితాలను తనిఖీ చేశారు. అమలాపురం పట్టణం, రూరల్ మండలం కామనగరువు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల జాబితాలను క్షేత్ర స్థాయిలో సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు వారి అభ్యర్థనలతోనే జరిగాయో లేదో స్వయంగా నిర్ధారించుకున్నారు. మున్సిపాలిటీలో 44, 59, 64, కామనగరువులో 73, 75 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని పలు ఇళ్లకు ఆర్‌డీఓ నేరుగా వెళ్లి, ఈ తనిఖీలు చేపట్టారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం–7 దరఖాస్తులపై బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ) పరిశీలన ఎంతవరకూ వాస్తవమో ఆరా తీశారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

తెలుగు.. అక్షరజ్యోతిలా వెలుగు..

- మన భాష అమృతతుల్యం
- ఈ భాషకు గ్రాంథిక సంకెళ్లు తెంచిన ఘనుడు గిడుగు
- నేడు ఆ మహనీయుని జయంతి.. తెలుగు భాషా దినోత్సవం

> ఎంతో తపస్సు చేస్తేనే కానీ ఆంధ్ర దేశంలో పుట్టే అదృష్టం కానీ, ఆంధ్ర భాష నేర్చుకునే అదృష్టం కానీ లభించదు
> – అప్పయ్య దీక్షితులు

> సుందరమైన తెలుగు పాట పాడుతూ, సింధూ నదిలో పడవ నడుపు
> – సుబ్రమణ్య భారతి

> ఏ భాష చెణుకైన, ఏ యాస చినుకైన తనలోన కలుపుకొని తరలింది తెలుగు
> – డాక్టర్ సి.నారాయణరెడ్డి


గిడుగు వెంకట రామమూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/రాజానగరం: తీయందనాలు పంచే అమ్మ భాష.. మన తెలుగు చదివినా.. విన్నా.. మాట్లాడినా.. ఆ అక్షర ప్రవాహపు అందానికి భాషాప్రేమికులు మంత్రముగ్ధులవుతారు. ఆనంద రసార్ణవంలో మునిగి తేలుతారు. వెండి వెన్నెల జలపాతాల్లో.. అమృత ధారల్లో తడిసి ముద్దయిన అనుభూతికి లోనవుతారు. అంతటి అందమైన.. సమస్త భావస్ఫోరకమైన.. కమ్మనైన తెలుగు భాష మాట్లాడే అర్హత ఎంతో తపస్సు చేస్తేనే కానీ లభించదు. చారిత్రక, సాంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో గోదావరి ఒడ్డున తెలుగు ఆదికవి నన్నయ భట్టారకుడు మహాభారతాన్ని ఆంధ్రీకరించాడు. తదనంతర కాలంలో ఎంతో మంది కవులు, రచయితలు ఎన్నో విలువైన రచనలను గ్రాంథిక భాషలో వెలువరించారు. ఇవి పండితులకు తప్ప సామాన్యులకు అర్థం కాని పరిస్థితి. అటువంటి రోజుల్లో అమృతతుల్యమైన మన తెలుగు భాషను గ్రాంథిక చెర నుంచి విడిపించి.. వ్యావహారిక పథానికి తీసుకువచ్చిన ఘనుడు గిడుగు వెంకట రామమూర్తి. నాటి కవిపండితులు గ్రాంథిక భాషకు పట్టం కడుతున్న రోజుల్లో.. వ్యావహారిక భాష కోసం పరితపించి, ఉద్యమం నడిపిన ఘనుడు ఆయన. గిడుగు జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

రాజమహేంద్రవరం వేదికగా.. : పర్లాకిమిడిని ఒడిశా రాష్ట్రంలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ గిడుగు రామమూర్తి తన మకాం రాజమహేంద్రవరానికి మార్చారు. 'ఈ నగరంలోనే కవి పండితులు ఎక్కువ మంది ఉన్నారు. నా వ్యావహారిక భాషోద్యమానికి ఇదే సరైన వేదిక అవుతుంది' అని అన్నారు. చివరి వరకూ ఇక్కడే నివసించారు. వ్యావహారిక భాష వ్యాప్తి కోసం 'తెలుగు' అనే పత్రిక నడిపేవారు. వ్యావహారిక భాషోద్యమంలో భాగంగా రాజమహేంద్రవరంలో నాడు గిడుగు నిర్వహించిన భాషా సదస్సులో కందుకూరి వీరేశలింగం పంతులు పాల్గొన్నారు. గిడుగు వారి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. కందుకూరి సులభ గ్రాంథిక భాషలో రచనలు చేసినా, వ్యావహారిక భాషకు అడ్డు చెప్పలేదు. వ్యావహారిక భాషకు కూడా వ్యాకరణం ఉండాలని పేర్కొంటూ 'సంగ్రహ ఆంధ్ర వ్యాకరణం' అనే పుస్తకాన్ని కూడా కందుకూరి రచించారు. తాను రాస్తున్న సరళ గ్రాంథికం కంటే కూడా వ్యావహారిక భాషే ప్రజలకు అత్యంత చేరువవుతుందని ఆయన గ్రహించారు. కొక్కొండ వెంకటరత్నం, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి వంటి ఉద్దండ పండితులు గ్రాంథిక భాష తప్పదని హెచ్చరిస్తున్న రోజుల్లో కూడా గిడుగు రామమూర్తి, గురజాడ వెంకట అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి సాహితీవేత్తలు వ్యావహారిక భాషను సమర్థించారు. 'శ్మశానాల వంటి నిఘంటువులు దాటి.. వ్యాకరణాల సంకెళ్లు విడిచి.. ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి..' అంటూ మహాకవి శ్రీశ్రీ సైతం కవితావేశంతో మరింత చైతన్యం తీసుకువచ్చారు.

అంతా ఆంగ్లమయం : వ్యక్తి పరిపూర్ణంగా ఎదగడానికి తెలుగు సాహిత్యాన్ని మించిన సాధనం మరొకటి లేదు. అయితే, ఆధునిక అవసరాలకు తగినట్టుగా మన భాషను కూడా ఆధునీకరించాల్సిన ఆవశ్యకత ఉంది. సాంకేతికంగా, బోధనాపరంగా అనేక మార్పులు చేయాల్సి ఉంది. ఉదయం లేచి, రాత్రి నిద్రపోయేంత వరకూ గుడ్ మార్నింగ్ నుంచి గుడ్ నైట్ వరకూ ప్రస్తుతం అంతా ఆంగ్లమయమే. తెలుగులో మాటలు కరువై వాట్సాప్‌లో తెలుగు, ఇంగ్లిష్ కలగలసిన టింగ్లిష్‌కే ప్రాధాన్యం లభిస్తోంది. మారుతున్న ప్రపంచంలో బతుకుతెరువు కోసం పర భాష తప్పనిసరి అయినా.. మాతృభాష పట్ల మమకారం ఎప్పటికీ సజీవంగా ఉండాలని నాటి తరం వారు, భాషా ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు.

తెలుగుకు ప్రాధాన్యం దక్కలేదు



దేశంలో భాషలు ఎక్కువ. పైగా 200 సంవత్సరాల యూరోపియన్ల ఆధిపత్యంలో మన భాషల ప్రాముఖ్యతనే కోల్పోయాం. అంతకు ముందు ఉర్దూ భాష ఏలింది. ఇక తెలుగు ఇళ్లల్లో మాట్లాడుకోవడానికే పనికి వచ్చింది. ఉమ్మడి మద్రాసు ప్రెసిడెన్సీలో కూడా తమిళానికి దక్కినంత ప్రాధాన్యం తెలుగుకు లభించలేదు. 'తెలుగు చాలా క్లుప్తంగా అన్ని విషయాలనూ అతి సమర్థవంతంగా వివరించగల సామర్థ్యం ఉన్న భాష. దీనికి భారతదేశ లింగ్వా ఫ్రాంకా(జాతీయ భాష)గా ఎంపిక చేయడానికి అన్ని అర్హతలూ ఉన్నాయి' అని జాతీయ భాష ఎంపిక కోసం నియమించిన హాల్డేన్ కమిషన్ ప్రశంసించింది. కానీ హిందీ ముందుకు వచ్చింది. తెలుగు ప్రాంతీయ భాషగా మిగిలిపోయింది. ఇంగ్లిష్ వారు ముద్రించిన రూపాయి నాణేలపై ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, తెలుగు భాషలే ఉండేవి. అంటే తెలుగుకు తొలి నుంచీ ప్రత్యేక గుర్తింపు, హోదా ఉన్నాయనే తెలుస్తోంది.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగు పరిశోధకుడు, ఎస్‌కేవీటీ కళాశాల, రాజమహేంద్రవరం

రసామృతంలా ప్రవహించాలి



తెలుగు భాషా దినోత్సవం రోజున వాట్సాప్‌లో డీపీలు మార్చితే సరిపోదు. పిలుపుల నుంచి పలుకుల వరకూ తెలుగులోనే సాగాలి. తేటతెలుగు తీయదనాన్ని చవులూరించేలా అందరూ పలకాలి. నాలుకలపై వేమన పద్యాలు నాట్యం ఆడాలి. పండగల వేళ నాటక ప్రదర్శనలు, పాటలు, పద్యాలు.. ఇలా ఒకటేమిటి అన్నీ సాగిపోవాలి. తెలుగు భాష అగ్నిలా ప్రజ్వరిల్లి, రసామృతమై ప్రవహించి.. వాయువై శ్వాసించి.. గగనమంతటా వ్యాపించాలి. అప్పుడే నిజమైన తెలుగు భాషా దినోత్సవం.

– చాగంటి మాలతి, తెలుగు పండితురాలు, పురాణ ప్రవచనకర్త, రాజమహేంద్రవరం

తెలుగే కనిపించాలి.. వినిపించాలి



మన భాషను రక్షించుకోవాలి. భాష లేకపోతే జీవితం లేదు.. స్నేహితులు లేరు.. బంధువులు లేరు.. బలగమూ లేదు.. సమాజమూ లేదు.. సంస్కృతీ లేదు. భాష మన ప్రాణం, మన జీవనం. అందరూ తెలుగు మాట్లాడాలి, చూడాలి, చదవాలి, రాయాలి. అంతటా తెలుగే కనిపించాలి.. తెలుగే వినిపించాలి.

– డాక్టర్ కేఎస్ మూర్తి నాయుడు, ఇస్రో మాజీ సైంటిస్ట్

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు ఏనాడో చెప్పారు. అయితే కాలక్రమంలో ఆధునీకత పేరిట పరాయిభాషా పదాలు వచ్చి మన భాషలో విలీనమైపోతున్నాయి. ఈ తరుణంలో మన భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనది అనే భావం ప్రతి తెలుగు వారిలో కలగాలి. అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. రేపటి తరానికి నేర్పించాలి. పిల్లలకు సంప్రదాయ పదాలు, సంబంధ బాంధవ్యాలు, మాండలిక పదాలు, సామెతలు, పొడుపు కథలు, పర్యావరణ పదజాలం, నూతన కల్పనాత్మక పదాలు, తెలుగు పదాల ఉచ్చారణలో కనబడే విశిష్ట పదజాలంపై అవగాహన కలిగించాలి. విశ్వవిద్యాలయాల్లో భాషా పీఠాలు ఏర్పాటు చేసి, పరిశోధనలను ప్రోత్సహించాలి.

– డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, అధ్యాపకులు, నన్నయ విశ్వవిద్యాలయం



మహాభారతం 'వజ్ర పంతి'లాంటిది



చిన్నప్పుడు కాపీ రైటింగ్ అని ఉండేది. కాపీ బుక్‌లో పైన ఉన్న వాక్యం చూసి మనం రాసేవాళ్లం. దానిని వజ్ర పంతి అనేవారు. అలాగే నన్నయ రచించిన మహాభారతం కూడా ఆయన తరువాతి తరాల రచయితలందరికీ 'వజ్ర పంతి'లా ఉపయోగపడుతోంది.

– బేతవోలు రామబ్రహ్మం, తెలుగు సంస్కృత పండితులు


తెలుగు భాషాభివృద్ధిలో 'నన్నయ'

'హంస' పురస్కారాల ప్రదానం

తెలుగు భాషాభివృద్ధికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తొలి నుంచీ తన వంతు కృషి చేస్తూనే ఉంది. వర్సిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యాన ఏటా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగా కవితా గోష్ఠి, సదస్సు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలనే 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు' కూడా ఘనంగా నిర్వహించారు. కాగా, ఈ ఏడాది కూడా రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ సహకారంతో యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సామాజిక, సాహిత్య రచనలు, కవిత్వం, అవధానం, మాతృభాషాభివృద్ధికి సాంకేతిక కృషి అనే ఐదు విభాగాల్లో విశిష్ట సేవలందించిన తొమ్మిది మందికి 'హంస' పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. 'నన్నయ' ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా పాల్గొంటారని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త శలాక రఘునాథశర్మ, విశిష్ట అతిథిగా ప్రముఖ సామాజిక సేవకురాలు, సాహితీవేత్త జక్కంపూడి విజయలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

గోవిందా హరి గోవిందా..

- వాడపల్లిలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు
- శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతి.. వాడపల్లి దివ్యక్షేత్రం.. భక్తుల గోవింద నామోచ్చారణతో మార్మోగింది. ఇక్కడి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పారమాత్మికోపనిషత్ పూర్వక ప్రధాన హోమాలు, మహాపూర్ణాహుతి, స్వామి వారికి విశేష ఆరాధన, మహదాశీర్వాచనం తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజాదికాలు నిర్వహించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని ఉదయం ప్రత్యేక పూల మాలలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ప్రధాన హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు


ఉత్సవ మూర్తులతో ఊరేగింపుగా..

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు..


- అందుకు నేనే ఉదాహరణ
- మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్
- నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం


నాటి గురువులను సత్కరిస్తున్న 1984-86 బ్యాచ్ విద్యార్థులు, మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్

కాకినాడ రూరల్: 'మాది పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వద్ద అతి చిన్న గ్రామం. అత్యంత పేదరికం. చదువుకు ప్రాధాన్యం ఇస్తూ.. అప్పటి ఏయూ పీజీ సెంటర్ విద్యార్థిగా ఉన్నప్పుడు జీవితంపై ఒక లక్ష్యం ఏర్పరచుకున్నాను. ఉన్నత స్థాయికి ఎదగాలని కష్టపడ్డాను. ఐపీఎస్ సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి, నేడు మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ హోదాలో ఉన్నాను' అని ఐపీఎస్ అధికారి జనార్దన్ అన్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ఏయూ పీజీ సెంటర్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ 1984–86 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి నిరీక్షణ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్, నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ, నమ్ముకున్న కష్టం, క్రమశిక్షణకు తోడు గురువులు నేర్పించిన మంచితనం తనను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాయని అన్నారు. విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వంటి పోటీ పరీక్షలకు ఏవిధంగా శిక్షణ తీసుకోవాలి, ఎటువంటి పుస్తకాలు చదవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు ప్రతి విద్యా సంస్థకు మార్గనిర్దేశక కార్యకర్తలుగా, తరువాతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులు తమ గుర్తుగా మహిళా హాస్టల్‌లో ఆర్ఓ ప్లాంట్‌కు రూ.70 వేలు, పురుషుల భోజనశాలలో బల్లలకు రూ.లక్ష చొప్పున ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారికి విరాళం అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా రూ.లక్ష అందిస్తామని చెప్పారు. 1996కు సంబంధించి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు జి.శ్యామ్ మాట్లాడుతూ, తన తరఫున ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తానని ప్రకటించారు. అనంతరం నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతి, విజయవాడ ఏసీపీ పి.భాస్కరరావు, విశ్రాంత ఏయూ ప్రొఫెసర్లు విశ్వనాథరావు, వెంకటరత్నం, దోనగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు రూ.10 లక్షల సాయం

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరద సహాయక చర్యల కోసం గెయిల్ సంస్థ రూ.10 లక్షల ఆర్థిక సాయం సమకూర్చింది. ఈ మేరకు చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు గెయిల్ అధికారులు సోమవారం అందజేశారు. రాజమహేంద్రవరం గెయిల్ ఓఐసీ కేవీఎస్ రావు, జనరల్ మేనేజర్ వైఏ కుమార్, హెచ్ఆర్ అధికారి ప్రభాకర్, సీఎస్ఆర్ మేనేజర్ బాలాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


కలెక్టర్ హిమాన్షు శుక్లాకు రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న గెయిల్ అధికారులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఎస్సై ఎస్ఏపీ హుస్సేన్ కథనం ప్రకారం.. ఐ.పంగిడి గ్రామానికి చెందిన మడిచర్ల గంగ (46) ఈ నెల 25న తన ఇంట్లో అద్దెకుంటున్న కాపెల్లి వెంకటకృష్ణ మోటార్ సైకిల్‌పై కోటసత్తెమ్మ గుడికి వెళ్తోంది. మార్గం మధ్యలో ఎస్.ముప్పవరం వద్ద ఓ కుక్క అకస్మాత్తుగా అడ్డం వచ్చింది. బైక్‌కు సడన్ బ్రేక్ వేయడంతో గంగ రోడ్డుపై పడిపోయి, తలకు బలమైన గాయమైంది. ఆమెను తొలుత నిడదవోలు, అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 లక్షల నగదు బ్యాగ్ చోరీ

గోకవరం: ఓ మహిళ వద్ద భారీ నగదుతో ఉన్న బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఎస్సై యూవీ శివనాగబాబు కథనం ప్రకారం.. గోకవరానికి చెందిన హంసబర్గుల కాశమ్మ సోమవారం ఉదయం ఇండియన్ బ్యాంక్‌లో రూ.లక్ష విత్‌డ్రా చేసింది. అనంతరం సమీపంలోని జాంపేట కో ఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎంలో రూ.లక్ష విత్‌డ్రా చేసింది. మొత్తం రూ.2 లక్షల నగదును ఒక బ్యాగులో పెట్టుకుని నడిచి వెళ్తోంది. వినాయకుని ఆలయం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి, ఆమె చేతిలోని బ్యాగ్ లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

అనపర్తి: వ్యక్తిగత సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.అప్పారావు కథనం ప్రకారం.. స్థానిక ఇందిరా నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లో ఈ సంఘటన జరిగింది. శ్రీకాకుళం జిల్లా మధురవాడ గ్రామానికి చెందిన మడ్డు ధర్మరాజు(36)కు అనపర్తికి చెందిన ఓ వివాహితతో పరిచయమైంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. అయితే, అప్పటికే ధర్మరాజుకు తన ప్రాంతానికి చెందిన మరో మహిళతో వివాహమైంది. ఇదిలా ఉండగా మద్యానికి బానిస కావడంతో సహజీవనం చేస్తున్న మహిళతో ధర్మరాజుకు ఇటీవల మనస్పర్థలు తలెత్తాయి. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధర్మరాజు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పారావు తెలిపారు.


ఆత్మహత్యకు పాల్పడిన ధర్మరాజు

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో కుండలేశ్వరం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడికి సుమారు 36 ఏళ్ల వయసుంటుందని అంచనా వేస్తున్నారు. బహిర్భూమికి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తూ పంట కాలువలోకి జారిపడి మరణించాడా లేక ఇతరత్రా కారణాలేవైనా ఉన్నాయా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.